# 2014 అంతర్జాతీయం

# ప్రతిభ

చరిత్రలో కలిసిపోయేందుకు మరో సంవత్సరం 2014 రూపంలో సిద్ధమైంది. గత సంవత్సరాల మాదిరిగానే మంచీచెడుల కలయికతో కాలగర్భంలో కలవనుంది. 16వ సార్వత్రిక ఎన్నికల్లో నరేంద్ర మోదీ ప్రభంజనం, స్కాట్లాండ్ రిఫరెండం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, నవ్యాంధ్ర నూతన అడుగులు, 'మామ్' విజయవంతంగా అంగారక కక్ష్యలోకి చేరటం, ప్రపంచాన్ని వణికించిన ఎబోలా, విశాఖలో హుద్‌హుద్ విధ్వంసం... ఇలా ఎన్నో ఘటనలకు సాక్ష్యంగా నిలిచిన 2014కు వీడ్కోలు చెబుతూ, పోటీ పరీక్షార్థుల కోసం ముఖ్యాంశాలను ఇయర్ రౌండప్ రూపంలో నేటి నుంచి వరుసగా అందిస్తున్నాం...

**ఫిబ్రవరి 5**



**ప్రపంచంలోనే మొట్ట మొదటి ఎలక్ట్రానిక్ కంప్యూటర్ 'కొలోసస్' 70 ఏళ్లు పూర్తి చేసుకుంది. 'కొలోసస్' కార్యకలాపాలు 1944, ఫిబ్రవరి 5న ప్రారంభమయ్యాయి.**

**ఏప్రిల్ 13**



**సామాజిక మీడియా ఫేస్‌బుక్‌లోని సమాచారాన్ని తొలగించాలని విజ్ఞప్తులు చేయడంలో భారత్ ప్రపంచంలోనే మొదటి స్థానంలో ఉన్నట్లు ఫేస్‌బుక్ వెల్లడించింది.**

**జులై 12**



**విశ్వవిఖ్యాత బాలీవుడ్ నటుడు దిలీప్‌కుమార్ పూర్వీకుల ఇంటిని పాకిస్థాన్ ప్రభుత్వం జాతీయ వారసత్వ సంపదగా ప్రకటించింది. పెషావర్ నగరంలో ప్రఖ్యాతిగాంచిన భవానీ బజార్ ప్రాంతంలో ఈ ఇల్లు ఉంది.**

**ఆగస్టు 8**



**పశ్చిమ ఆఫ్రికాలో విజృంభిస్తున్న ఎబోలా మహమ్మారిపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) 'అంతర్జాతీయ ప్రజారోగ్య అత్యవసర స్థితి'ని ప్రకటించింది.**

## జనవరి

12. బంగ్లాదేశ్ ప్రధానమంత్రిగా 66 సంవత్సరాల షేక్ హసీనా పదవీ బాధ్యతలు చేపట్టారు. గత రెండు దశాబ్దాల్లో హసీనా ప్రధాని పీఠాన్ని అధిరోహించడం ఇది మూడోసారి.

17. ప్రపంచంలోనే అత్యధికంగా పోలియో కేసులు పాకిస్థాన్‌లోని పెషావర్‌లో నమోదవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) వెల్లడించింది. 2013లో పాకిస్థాన్‌లో నమోదైన 91 పోలియో కేసుల్లో 83 పెషావర్‌తో సంబంధమున్నవేనని సంస్థ వెల్లడించింది.

26. చైనాలో ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త, గ్రామీణ చిన్నారులకు పట్టణాల్లో చదివే హక్కు కల్పించాలని, అధికారులు తమ ఆస్తులు ప్రకటించాలని పోరాడుతున్న ప్రముఖ న్యాయవాది జు జియాంగ్‌కు అక్కడి న్యాయస్థానం నాలుగేళ్ల జైలుశిక్షను విధించింది.

## ఫిబ్రవరి

10. పదహారేళ్లపాటు భారత్‌లో స్వీయ ప్రవాసంలో ఉన్న నేపాలీ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుశీల్ కొయిరాలా నేపాల్ ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు.

11. అల్జీరియా సైన్యానికి చెందిన హెర్క్యులస్ సి-130 విమానం కూలిన ఘటనలో 103 మంది మరణించారు.

17. ఇటలీ నూతన ప్రధానమంత్రిగా మెటియో రెంజీ ఎంపికయ్యారు. యూరోపియన్ యూనియన్‌లో అతి పిన్న వయస్కుడైన ప్రధానిగా ఈయన రికార్డు సృష్టించారు.

## మార్చి

2. ఉక్రెయిన్‌ను ఆక్రమించుకునే హక్కు తమకుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించడం వివాదాస్పదమైంది. ఈ నేపథ్యంలో రష్యాతో యుద్ధానికి తామూ సిద్ధమేనని ఉక్రెయిన్ ప్రధానమంత్రి ఆర్సెనీ యత్సెనియుక్ ప్రకటించారు.

3. ఉక్రెయిన్‌పై సైనిక దాడికి దిగిన రష్యా దళాలు క్రిమియా పట్టణానికి సమీపంలోని నౌకాస్థావరాన్ని స్వాధీనం చేసుకున్నాయి. దీనికి నిరసనగా అమెరికా రష్యాతో సైనిక సహకారాన్ని నిలిపివేసింది.

13. ఎల్ సాల్వడార్ నూతన అధ్యక్షునిగా సాల్వడార్ సాంచెజ్ సెరెన్ ఎన్నికయ్యారు. నార్మన్ క్విజానోపై ఈయన గెలుపొందారు.

21. కెన్యా పార్లమెంటు బహుభార్యత్వానికి చట్టబద్ధత కల్పిస్తూ తీర్మానం చేసింది.

24. అదృశ్యమైన తమ విమానం ఎం.హెచ్.370 దక్షిణ హిందూ మహాసముద్రంలో కూలిపోయినట్లు మలేసియా ప్రధానమంత్రి నజీబ్ రజాక్ ప్రకటించారు.

30. ఆండ్రెజ్ కిస్కా స్లొవేకియా నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.

## ఏప్రిల్

1. ఫ్రాన్స్ నూతన ప్రధానమంత్రిగా మాన్యువల్ వాల్స్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాజీనామా చేసిన జీన్-మార్క్ ఐరౌల్ట్ స్థానంలో ఈయన బాధ్యతలు చేపట్టారు.

5. అఫ్గానిస్థాన్‌లో చరిత్రాత్మక అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు.

14. నైజీరియా రాజధాని అబూజా శివార్లలో బాంబు పేలిన ఘటనలో 71 మంది మృతి చెందారు.

16. దక్షిణ కొరియాలో భారీ దుర్ఘటన చోటు చేసుకుంది. 459 మందితో కూడిన 'ఎంవీ సియోల్' అనే ఓడ ఇంచియాన్ పట్టణం నుంచి జెజూ ద్వీపానికి వెళ్తుంగా బ్యోంగ్‌పంగ్ అనే ద్వీపం వద్ద ప్రమాదానికి గురై సముద్రంలో మునిగిపోయింది. ఈ దుర్ఘటనలో 295 మంది మరణించారు.

27. అంతర్జాతీయ హిందీ సమ్మేళనాన్ని న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో నిర్వహించారు.

28. ఫలాలలో రాజుగా పేరొందిన భారత 'అల్‌ఫాన్సో' మామిడిపండ్ల దిగుమతులపై యూరోపియన్ యూనియన్ (ఈయూ) మే 1 నుంచి అమల్లోకి వచ్చేటట్లుగా తాత్కాలిక నిషేధాన్ని విధించింది. అల్‌ఫాన్సో రకం మామిడి పండ్లతోపాటు వంకాయ, చేమదుంప, కాకరకాయ, పొట్లకాయల దిగుమతిపై కూడా ఈయూ తాత్కాలిక నిషేధాన్ని విధించింది.

## మే

1. ప్రపంచంలో అత్యంత ఎత్తులో ఉన్న హైస్పీడ్ రైలు సొరంగాన్ని చైనా ప్రారంభించింది. ఈ సొరంగం పొడవు 16.3 కిలోమీటర్లు. ఇది గన్సు, జింజియాంగ్ ప్రావిన్స్‌లను కలుపుతుంది. ఈ సొరంగం సముద్ర మట్టానికి 3,607 మీటర్ల ఎత్తులో ఉంది.

2. అఫ్గానిస్థాన్‌లో భారీ వర్షాలు కురవడంతో కొండచరియలు విరిగిపడి 350 మంది మృత్యువాతపడ్డారు.

4. లిబియా నూతన ప్రధానమంత్రిగా వ్యాపారవేత్త అహ్మద్ మతిక్ ప్రమాణస్వీకారం చేశారు.

14. టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌కు 250 కిలోమీటర్ల దూరంలోని సోమ ప్రాంతంలో బొగ్గుగనిలో పేలుడు సంభవించి 245 మంది మృతి చెందారు.

22. థాయ్‌లాండ్‌లో 'రక్తరహిత తిరుగుబాటు'తో సైన్యం అధికారాన్ని చేజిక్కించుకుంది. రాజ్యాంగాన్ని రద్దు పరచింది. నెలల తరబడి కొనసాగుతున్న ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు దేశాన్ని అనిశ్చితిలో పడవేయడంతో సైన్యం ఈ నిర్ణయం తీసుకుంది.

24. దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా వరుసగా రెండోసారి జాకబ్ జుమా బాధ్యతలు చేపట్టారు.

29. ఈజిప్టు అధ్యక్ష ఎన్నికల్లో దేశ మాజీ సైన్యాధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా అల్‌సిసి ఘనవిజయం సాధించారు. ఆయన ఏకంగా 96 శాతం ఓట్లను సాధించారు.

## జూన్

5. సిరియా ఎన్నికల్లో ఆ అధ్యక్షుడు బషర్ అల్ అసద్ ఘనవిజయం సాధించారు. ఆయన మరో ఏడేళ్లపాటు పాలన కొనసాగించనున్నారు.

9. పాకిస్థాన్ ఆర్థిక రాజధాని కరాచీలోని జిన్నా అంతర్జాతీయ విమానాశ్రయంపై ఉగ్రవాదులు భీకర దాడికి పాల్పడిన ఘటనలో 10 మంది ఉగ్రవాదులు సహా 29 మంది చనిపోయారు.

13. ప్రతిష్టాత్మక వాషింగ్టన్ ఒడంబడికలో భారత్‌కు పూర్తి స్థాయిలో శాశ్వత సభ్యత్వం లభించింది. దాంతో భారతీయ డిగ్రీలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించడంతో పాటు, అమెరికా తదితర దేశాల్లో ఉద్యోగాలకు భారతీయ ఇంజనీర్లు మరింత సులువుగా వెళ్లేందుకు విస్తృతావకాశాలు లభిస్తాయి.

23. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ గౌరవార్థం ఈస్ట్ ఇండియా కంపెనీ (ఈఐసీ) 210 బంగారు నాణేల్ని విడుదల చేసింది. సచిన్ 24 ఏళ్ల కెరీర్ నేపథ్యంగా 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారంతో సంస్థ ఈ నాణేలను రూపొందించింది.

## జులై

17. ఉక్రెయిన్-రష్యా సరిహద్దులో ఘోర విమాన దుర్ఘటన జరిగింది. మలేసియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎమ్‌హెచ్17 అనే బోయింగ్ 777 విమానాన్ని రష్యా అనుకూల తిరుగుబాటుదారులు క్షిపణి దాడి చేసి పేల్చివేయటంతో విమానంలో ఉన్న మొత్తం 295 మంది దుర్మరణం పాలయ్యారు.

21. నల్లధనం సమస్యపై ప్రపంచ దేశాలు కలసికట్టుగా పోరాడేందుకు ముందుకు కదిలాయి. పారిస్‌లోని 'ఆర్థిక సహకారం, అభివృద్ధి సంస్థ' (ఓఈసీడీ) ఆర్థిక ఖాతాదారుల సమాచారం పంపిణీపై 'ఏకీకృత విశ్వ ప్రమాణాలను' విడుదల చేసింది.

28. మొదటి ప్రపంచ యుద్ధ ప్రారంభానికి వందేళ్లు పూర్తయ్యాయి. 1914 జులై 28న సెర్బియాపై ఆస్ట్రియా - హంగేరీ యుద్ధం ప్రకటించాయి. ఇదే మొదటి ప్రపంచ యుద్ధానికి ఆరంభం.

## ఆగస్టు

7. పశ్చిమాఫ్రికాలోని సియెర్రాలియోన్, లైబీరియా, గినియా, నైజీరియా దేశాల్లో ఎబోలా వైరస్ బారినపడి సుమారు 950 మంది మరణించటం కలకలం సృష్టించింది. మొదటిసారిగా కాంగోలోని ఎబోలా నది సమీపంలో 1976లో ఈ వైరస్ కనిపించింది.

17. మెక్సికోలోని ఆగ్నేయ రాష్ట్రం కాంపెచేలో దట్టమైన వృక్ష సమూహాల మధ్య మరుగునపడిన రెండు పురాతన పట్టణాలు వెలుగుచూశాయి. ఈ పట్టణాలు మాయన్ సంస్కృతిని ప్రతిబింబిస్తున్నాయి.

29. పశ్చిమ ఆఫ్రికా దేశాలను వణికిస్తున్న ఎబోలా వైరస్‌కు విరుగుడుగా శాస్త్రవేత్తలు తయారుచేసిన 'జీమ్యాప్' అనే ప్రయోగాత్మక ఔషధం కోతుల్లో సత్ఫలితాలనిచ్చింది.

## సెప్టెంబరు

7. చైనా రాజధాని బీజింగ్‌లో సుమారు 20 వేల మంది దంపతులకు రెండో సంతానం కోసం అక్కడి ప్రభుత్వం అనుమతినిచ్చింది. చైనాలో ఇప్పటివరకు ఏకశిశు విధానం అమల్లో ఉంది.

11. ఇరాక్, సిరియాల్లోని సాయుధ సంస్థ 'ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐఎస్ఐఎస్)' పీచమణిచేందుకు ఉగ్రవాద నిరోధక వ్యూహాలతో నిరంతర పోరు సాగిస్తామని అమెరికా అధ్యక్షుడు ఒబామా అధికార టీవీ కార్యక్రమంలో ప్రకటించారు.

13. ప్రపంచంలోనే అతిపెద్ద రాకెట్ వెల్డింగ్ కేంద్రాన్ని అమెరికాలో ప్రారంభించారు. అమెరికాలోని న్యూ ఆర్లాన్స్‌లో ఉన్న మికౌడ్ రాకెట్ అనుసంధాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ 'వర్టికల్ అసెంబ్లీ సెంటర్ (వాక్)'ను నాసా ఆవిష్కరించింది.

29. అఫ్గానిస్థాన్ అధ్యక్షుడిగా అష్రాఫ్ ఘనీ ప్రమాణం చేశారు. అంతర్యుద్ధంతో అట్టుడికిన అఫ్గానిస్థాన్‌లో తొలిసారిగా ప్రజాస్వామ్యయుతంగా హమీద్ కర్జాయ్ నుంచి అష్రాఫ్ ఘనీకి అధికార బదిలీ జరిగింది.

## అక్టోబరు

6. అంగారక గ్రహ కక్ష్యలోకి భారత్ దిగ్విజయంగా ప్రవేశపెట్టిన మామ్ ఉపగ్రహ ప్రయోగాన్ని పరిహసిస్తున్నట్లుగా తాము ప్రచురించిన కార్టూన్ వ్యవహారంపై 'ది న్యూయార్క్ టైమ్స్' క్షమాపణలు చెప్పింది.

9. ఎబోలా వ్యాధిపై పోరు కోసం ఐక్యరాజ్య సమితికి అత్యధిక విరాళాలు అందిస్తున్న దేశాల్లో భారత్ ఐదో స్థానంలో ఉంది. అత్యధికంగా 11.38 కోట్ల డాలర్లను అమెరికా అందించింది.

27. పోటాపోటీగా జరిగిన బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో వామపక్ష మహిళానేత, వర్కర్స్ పార్టీకి చెందిన దిల్మారౌసెఫ్ తిరిగి వరుసగా రెండోసారి విజయం సాధించారు.

30. పాలస్తీనాను స్వీడన్ అధికారికంగా గుర్తించింది.

## నవంబరు

1. పిల్లల పేర్లు సంప్రదాయబద్ధంగా ఉండాలంటూ చైనా ప్రభుత్వం కొత్త చట్టం తీసుకొచ్చింది. దీనికి నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్ ఆమోదం తెలియజేసింది.

9. బెర్లిన్ గోడ కూల్చివేత ఘట్టానికి 25 ఏళ్లు నిండాయి.

21. అనుమతి లేకుండా అమెరికాలో ఉంటున్న లక్షలాది మంది భారతీయులు, ఇతర విదేశీయులు అమెరికాలో తాత్కాలికంగా ఉండటానికి వీలుగా చట్టబద్ధత కల్పిస్తూ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా 'వలస విధానం'లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు.

23. ట్యునీషియాలో భారీ బందోబస్తు మధ్య తొలిసారిగా అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు.

25. మరణ శిక్షలు విధించడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలనే ఐక్యరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభ ముసాయిదా తీర్మానికి వ్యతిరేకంగా భారత్ ఓటు వేసింది.

## డిసెంబరు

3. ఎలాంటి నిబంధనలూ లేకుండా అణ్వస్త్రరహిత దేశంగా ఉండటానికి వెంటనే అంగీకరించడంపై ఐరాస సాధారణ సభలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని భారత్ వ్యతిరేకించింది.

5. మాల్దీవులలో జల అత్యయిక స్థితిని ప్రకటించారు. రాజధాని మాలేలోని నీటిశుద్ధి కేంద్రంలో అగ్నిప్రమాదం నేపథ్యంలో జల అత్యయిక స్థితి ప్రకటించారు.

9. ప్రపంచ వాణిజ్య సంస్థలో భారత్‌కు ఘనవిజయం లభించింది. భారత్ నుంచి దిగుమతి అయ్యే ఉక్కు ఉత్పత్తులపై అధిక సుంకం విధిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయం సరికాదని డబ్ల్యూటీఓ తేల్చిచెప్పింది.

14. జపాన్ ప్రధానమంత్రిగా షింజో అబే మరోసారి గెలుపొందారు.

**సెప్టెంబరు 19**



**బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందే అంశంపై స్కాట్లాండ్‌లో నిర్వహించిన రెఫరెండం వీగిపోయింది. ఈ అభిప్రాయ సేకరణలో సగానికి పైగా జనాభా బ్రిటన్‌తో కలిసి ఉండేందుకే మొగ్గుచూపారు.**

**అక్టోబరు 3**



**హాంకాంగ్ విద్యార్థుల 'ఆక్యుపై సెంట్రల్' ఉద్యమం తారస్థాయికి చేరింది. 2017 ఎన్నికలను సార్వత్రిక ఓటింగ్ హక్కుతో నిర్వహిస్తామన్న చైనా తర్వాత మాట మార్చిందని విద్యార్థులు పెద్దఎత్తున ఉద్యమం చేపట్టారు.**

**నవంబరు 3**



**అమెరికాలోని న్యూయార్క్ నగరంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ టవర్ (ఫ్రీడం టవర్)లో వాణిజ్య కార్యకలాపాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. 2001 సెప్టెంబరు 11వ తేదీన ఉగ్రవాదుల దాడిలో డబ్ల్యుటీసీ ధ్వంసమైంది.**

**డిసెంబరు 16**



**పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఒక సైనిక పాఠశాలపై తాలిబన్ ఆత్మాహుతి దళం ఆకస్మికంగా దాడి చేసి 140 మందికిపైగా విద్యార్థులను కాల్చి చంపిన ఘటన అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది.**

# 2014 జాతీయం

ప్రతిభ

**మే 26**



**భారత 15వ ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఒకనాటి సాదాసీదా చాయ్‌వాలా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశ ప్రభుత్వాధినేత సింహాసనాన్ని అధిష్టించారు.**

**జనవరి 26**



**65వ భారత గణతంత్ర వేడుకలకు జపాన్ ప్రధానమంత్రి షింజో అబే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జపాన్ ప్రధాని భారత గణతంత్ర ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొనటం ఇదే ప్రథమం.**

**ఫిబ్రవరి 14**




**దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తన పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) 49 రోజుల 'పాలన ప్రయోగం' ముగిసింది.**

**మే 16**

**16వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. 282 సీట్లు సాధించిన భాజపా ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమం చేసుకుంది. కాంగ్రెస్ 44 సీట్లతో సరిపెట్టుకుంది.**

**జులై 3**



**దేశంలోనే అత్యంత వేగవంతమైన ప్రయోగాత్మక రైలు పరుగును రైల్వే శాఖ దిల్లీ - ఆగ్రాల మధ్య విజయవంతంగా నిర్వహించింది. ఈ రైలు గంటకు 160 కి.మీ. వేగంతో ప్రయాణించింది.**

**సెప్టెంబరు 14**

**ప్రపంచ ప్రసిద్ధి చెందిన అలనాటి నలంద విశ్వవిద్యాలయంలో 821 ఏళ్ల తర్వాత తిరిగి తరగతులు ప్రారంభమయ్యాయి. బిహార్‌లోని రాజ్‌గిర్‌లో తాత్కాలిక ప్రాంగణంలో ఇవి మొదలయ్యాయి.**

**సెప్టెంబరు 27**



**ఆదాయాన్ని మించి ఆస్తుల కేసులో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం నాలుగేళ్ల జైలు శిక్ష, రూ. 100 కోట్ల జరిమానా విధించింది.**

**అక్టోబరు 2**

स्वच्छ भारत
एक कदम स्वच्छता की ओर

**రూ. 62,000 కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా అయిదేళ్లపాటు కొనసాగే భారీ పారిశుద్ధ్య పథకం 'స్వచ్ఛ భారత్'ను గాంధీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ న్యూదిల్లీలో ప్రారంభించారు.**

**నవంబరు 17**



**షారుక్ ఖాన్, దీపికా పదుకొనె ప్రధాన పాత్రల్లో నటించిన 'హ్యాపీ న్యూ ఇయర్' చిత్రం ప్రఖ్యాత ఆస్కార్ లైబ్రరీలో చోటు దక్కించుకుంది. ఈ చిత్రానికి దర్శకురాలు ఫరాఖాన్.**

## జనవరి

1. లోక్‌పాల్ బిల్లుకు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదం తెలిపారు. ఈ బిల్లుకు 2013 డిసెంబరు 17న రాజ్యసభ, ఆ మరుసటి రోజు లోక్‌సభ ఆమోదం తెలిపాయి.

★ అగస్టా వెస్ట్‌ల్యాండ్‌తో రూ. 3,600 కోట్ల విలువైన వీవీఐపీ హెలికాప్టర్ల ఒప్పందాన్ని కేంద్రం రద్దు చేసుకుంది.

★ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న నూతన భూసేకరణ చట్టం అమల్లోకి వచ్చింది. 1894 నాటి చట్టం స్థానంలో తీసుకొచ్చిన ఈ కొత్త చట్టంతో భూములు కోల్పోయేవారికి పూర్తిస్థాయిలో పరిహారం, పునరావాసం అందుతాయి.

7. కౌమార దశలో ఆరోగ్య, ఆహార, ఇతర సాంఘిక సమస్యలను అధిగమించేలా సాయపడేందుకు 10-19 ఏళ్ల లోపు వారికోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ కిషోర్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌కేఎస్‌కే)ను ప్రారంభించింది.

13. వరుసగా మూడో ఏడాదీ దేశంలో కొత్తగా పోలియో కేసులు నమోదు కాలేదని కేంద్రం ప్రకటించింది. దేశంలో చివరిసారిగా 2011 జనవరి 13న పశ్చిమ్ బంగలోని హావ్‌డా జిల్లాలో పోలియో కేసు నమోదైంది.

20. జైనులను మైనారిటీ జాబితాలో చేరుస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

## ఫిబ్రవరి

1. దేశంలో జాతీయ ఆహార భద్రత చట్టాన్ని ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా బిహార్ ఘనత సాధించింది.

2. కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియం ద్విశతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

4. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణకు ఉద్దేశించిన ఏడో వేతన సవరణ సంఘం కూర్పును ప్రభుత్వం ఆమోదించింది. దీనికి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అశోక్‌కుమార్ మాథుర్ నేతృత్వం వహిస్తారు.

17. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాతో దిల్లీలో రాష్ట్రపతి పాలన విధించారు.

18. ఆంధ్రప్రదేశ్ విభజనకు లోక్‌సభ మూజువాణి ఓటుతో ఆమోద ముద్ర వేసింది.

20. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును రాజ్యసభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

## మార్చి

1. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వశాఖ రూపొందించిన 'స్వావలంబన' కార్యక్రమాన్ని బెంగళూరులో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పారిశుద్ధ్య కార్మికులకు పునరావాసం, నైపుణ్య శిక్షణ ఆఫర్లు, స్వయం ఉపాధి రుణం, చెక్కుల పంపిణీ మొదలైన పనులు చేపడతారు.

5. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 543 స్థానాలున్న 16వ లోక్‌సభకు గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది దశల ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

8. ఎరువుల వాడకాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎస్ఎస్ఎన్ఎమ్ (సైట్-స్పెసిఫిక్ న్యూట్రియంట్ మేనేజ్‌మెంట్ - నిర్దిష్ట క్షేత్ర పోషకాల నిర్వహణ) అనే కొత్త కార్యక్రమాన్ని ప్రకటించింది.

12. ఓటర్లకు ప్లాస్టిక్ ఫొటో గుర్తింపు కార్డులను అందించిన తొలి రాష్ట్రాలుగా నాగాలాండ్, అసోం రికార్డు సృష్టించాయి.

27. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) భారత్‌ను 'పోలియో రహిత దేశం'గా అధికారికంగా ప్రకటించింది.

## ఏప్రిల్

7. భారతీయ రైల్వే పటంలో అరుణాచల్ ప్రదేశ్ చోటు పొందింది. రాష్ట్రంలోని మొట్టమొదటి ప్యాసింజర్ రైలును నెహర్లాగన్‌లో ప్రారంభించారు.

15. హిజ్రా (ట్రాన్స్‌జెండర్)లకు హక్కులు కల్పిస్తూ సుప్రీం కోర్టు కీలక తీర్పు వెలువరించింది. లింగ వర్గీకరణ విషయంలో హిజ్రాలకు మూడో కేటగిరీ కింద చట్టబద్ధమైన గుర్తింపును సుప్రీంకోర్టు మంజూరు చేసింది.

24. కేరళలోని శ్రీ అనంత పద్మనాభస్వామి ఆలయంలో ఉన్న అమూల్యమైన సంపదను తనిఖీ (ఆడిటింగ్) చేయడానికి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ తనిఖీ ప్రక్రియకు మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) వినోద్ రాయ్ నేతృత్వం వహించాలని పేర్కొంది.

## మే

1. నల్లధనం కేసుల దర్యాప్తు కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను సుప్రీంకోర్టు పునర్వ్యవస్థీకరించింది. ఈ బృందానికి మాజీ న్యాయమూర్తులు జస్టిస్ ఎంబీ షాను ఛైర్మన్‌గా నియమించింది.

7. ఎడ్లను హింసకు గురిచేసే జల్లికట్టు, ఇతర బండిలాగుడు పందేలను సుప్రీంకోర్టు నిషేధించింది.

12. తొమ్మిది విడతల్లో జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికలు పోలింగ్ శాతం విషయంలో సరికొత్త రికార్డును నెలకొల్పాయి. ఈ ఎన్నికల్లో సరాసరి 66.38 శాతం ఓటింగ్ నమోదైంది. దీంతో 1984 ఎన్నికలనాటి 64.04 శాతం ఓటింగ్‌ను అధిగమించినట్లయింది.

15. తమిళ తీవ్రవాద సంస్థ ఎల్‌టీటీఈపై విధించిన నిషేధాన్ని కేంద్ర ప్రభుత్వం అయిదేళ్లపాటు పొడిగించింది.

22. గుజరాత్ తొలి మహిళా ముఖ్యమంత్రిగా ఆనందీ బెన్ పటేల్ ప్రమాణ స్వీకారం చేశారు.

28. భారత 14వ అటార్నీ జనరల్‌గా ముకుల్ రోహత్గీ నియమితులయ్యారు.

## జూన్

8. ముంబయి మెట్రో రైలు సేవలు ప్రారంభమయ్యాయి.

12. గుజరాత్‌లో నర్మదా నదిపై నిర్మించిన సర్దార్ సరోవర్ ఆనకట్ట ఎత్తును ఇప్పుడున్న 121.92 మీటర్ల నుంచి 138.68 మీటర్ల గరిష్ఠ ఎత్తుకు పెంచటానికి నర్మదా నియంత్రణ అథారిటీ (ఎన్‌సీఏ) అనుమతించింది.

17. 2030 నాటికి 'భూ వినాశ రహిత' (ల్యాండ్ డిగ్రెడేషన్ న్యూట్రల్) దేశంగా అవతరించాలని భారత్ నిర్ణయించింది. భారత్‌లో భూమి ఎడారీకరణ వేగంగా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో మోదీ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించింది.

22. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ)తో 2009లో భారత్ కుదుర్చుకున్న అదనపు ప్రోటోకాల్‌ను ప్రభుత్వం ఆమోదించింది.

24. చైనా నుంచి పాలు, పాల ఉత్పత్తుల దిగుమతిపై నిషేధాన్ని మరో ఏడాది కాలం పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

28. అరుణాచల్ ప్రదేశ్ తమ భూభాగంలోని ప్రాంతంగా పేర్కొంటూ చైనా రూపొందించిన తాజా మ్యాప్‌పై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

## జులై

4. జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపూర్ - కాట్రా రైల్వే మార్గాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు.

11. తీవ్ర నిరసనల మధ్య పోలవరం ప్రాజెక్టు బిల్లు (ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ సవరణ బిల్లు 2014)కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. పోలవరం ముంపు ప్రాంతాలున్న ఖమ్మం జిల్లాలోని ఏడు రెవెన్యూ మండలాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కలుపుతూ కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు.

21. ఉపాధి హామీ కింద చేపట్టే పనుల్లో వ్యవసాయ, అనుబంధ రంగాల అభివృద్ధికి సంబంధించినవి 60 శాతం తప్పనిసరిగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

24. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్‌ను కేంద్ర ప్రభుత్వం రద్దుచేసింది. దీని పునరుద్ధరణే లక్ష్యంగా రద్దుచేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది.

28. సైన్స్ ఎక్స్‌ప్రెస్ రైలును దిల్లీలోని సఫ్దర్ జంగ్ రైల్వే స్టేషన్‌లో కేంద్ర శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞాన శాఖ, పర్యావరణ, అటవీ, రైల్వే శాఖలు కలిసి ప్రారంభించాయి.

## ఆగస్టు

13. న్యాయమూర్తుల నియామకం కోసం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటుకు వీలుకల్పించే బిల్లును లోక్‌సభ ఆమోదించింది. మర్నాడు రాజ్యసభ ఆమోదించింది.

19. హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాలను కలిపే జాతీయ రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ హరియాణాలోని కైథాల్‌లో శంకుస్థాపన చేశారు.

21. జాతీయ యుద్ధ స్మృతి చిహ్నం నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.400 కోట్ల వ్యయంతో ఈ స్మృతి చిహ్నాన్ని దిల్లీలోని ఇండియా గేట్ కాంప్లెక్స్‌లో నిర్మించనున్నారు.

28. కేంద్రం ప్రతిష్టాత్మకంగా దేశవ్యాప్తంగా చేపట్టిన ప్రధాన మంత్రి జన్ ధన్ యోజనను ప్రధాని మోదీ దిల్లీలో ప్రారంభించారు.

## సెప్టెంబరు

3. ప్రఖ్యాత భారత శాస్త్రీయ సంగీత విద్యాంసుల సేవలకు గుర్తింపుగా న్యూదిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఎనిమిది తపాలా బిళ్లలను విడుదల చేశారు.

★ భారత శాస్త్రీయ సంగీత వాగ్గేయకారులైన పండిట్ రవిశంకర్, పండిట్ భీంసేన్ జోషి, డీకే పట్టమ్మాళ్, పండిట్ మల్లికార్జున్ మన్సూర్, గంగూబాయి హంగల్, పండిట్ కుమార్ గంధర్వ, ఉస్తాద్ విలాయత్ ఖాన్, ఉస్తాద్ అలీ అక్బర్ ఖాన్‌లపై తపాలా శాఖ వీటిని రూపొందించింది.

7. భారీ వర్షాలు, వరదల ధాటికి జమ్మూ కశ్మీర్ తీవ్ర ఇబ్బందులకు గురయింది. సుమారు 200 మంది ప్రాణాలు కోల్పోయారు.

10. విశిష్ట గుర్తింపు సంఖ్య (ఆధార్) ప్రాజెక్టు అయిదో దశను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ దశ కింద ఉత్తర్ ప్రదేశ్, బిహార్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఈ ప్రాజెక్టును చేపడతారు.

23. 2015 ఆస్కార్ ఎంట్రీ కోసం ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో భారత్ నుంచి 'లయర్స్ డైస్' ఎంపికైంది.

24. బొగ్గు క్షేత్రాల కేటాయింపులపై సుప్రీం కోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. 1993 నుంచి 2010 వరకు వివిధ కంపెనీలకు కేటాయించిన మొత్తం 218 క్షేత్రాల్లో 214 క్షేత్రాల కేటాయింపులను రద్దు చేసింది.

25. దేశాన్ని తయారీ కేంద్రంగా మార్చాలన్న లక్ష్యంతో 'భారత్‌లో తయారీ' (మేక్ ఇన్ ఇండియా) ప్రచార కార్యక్రమాన్ని దిల్లీలో ప్రధాని మోదీ ప్రారంభించారు.

28. సుప్రీంకోర్టు 42వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ హెచ్‌ఎల్ దత్తు ప్రమాణ స్వీకారం చేశారు.

## అక్టోబరు

3. ప్రధాని మోదీ విస్తృత జన బాహుళ్యానికి చేరువ కావడానికి ఆలిండియా రేడియోలో తొలిసారిగా 'మన్ కీ బాత్' పేరుతో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

10. జాతీయ మానసిక ఆరోగ్య విధానాన్ని కేంద్రప్రభుత్వం ఆవిష్కరించింది.

11. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణ్ జయంతిని పురస్కరించుకుని 'ఎంపీ ఆదర్శ గ్రామ పథకం' (సంసద్ ఆదర్శ్ గ్రామ్ యోజన - ఎస్ఏజీవై) ను ప్రధాని మోదీ న్యూదిల్లీలో ప్రారంభించారు.

29. విదేశీ బ్యాంకు ఖాతాలున్న 627 మంది భారతీయులు, ప్రవాస భారతీయుల పేర్లతో కూడిన జాబితాను కేంద్ర ప్రభుత్వం ఒక సీల్డ్‌కవర్‌లో సుప్రీంకోర్టుకు అందజేసింది.

31. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ప్రధాని మోదీ 'జాతీయ ఐక్యదినం'గా ప్రకటించారు.

## నవంబరు

12. ఏఐఏడీఎంకే అధినేత్రి జయలలిత పదేళ్లపాటు ఎన్నికల్లో పాల్గొనడానికి అనర్హులని తమిళనాడు ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

18. కిసాన్ వికాస పత్రాలను (కేవీపీ) కేంద్ర ప్రభుత్వం మళ్లీ విడుదల చేసింది.

29. మేఘాలయకు తొలిసారిగా రైలు అనుసంధానాన్ని కల్పిస్తూ మెంధిపథర్ - గౌహతి ప్యాసింజర్ రైలును ప్రధాని మోదీ గౌహతిలో ప్రారంభించారు.

30. సాంస్కృతిక వారసత్వ సంపదకు ఆలవాలమైన పురాతన నగరాల పరిరక్షణ, అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 'హృదయ్' పేరుతో ప్రత్యేక పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

## డిసెంబరు

2. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి పుట్టినరోజైన డిసెంబరు 25ను 'జాతీయ సుపరిపాలన దినోత్సవం'గా పాటించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

4. ఆడపిల్లల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 'సుకన్య సమృద్ధి ఖాతా' పథకాన్ని ఆరంభించింది.

11. భారత్ నేతృత్వంలో చేసిన తీర్మానాన్ని ఐక్య రాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ ఆమోదిస్తూ జూన్ 21ని 'అంతర్జాతీయ యోగా దినం'గా ప్రకటించింది.

# 2014 రాష్ట్రీయం

**ఏప్రిల్** 16



**6**1వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో తెలుగు చిత్రం 'నా బంగారు తల్లి' మూడు పురస్కారాలను గెలుచుకుంది. తెలుగులో ఉత్తమ ప్రాంతీయ భాషా చిత్రంగా నిలవడమే కాకుండా ఉత్తమ నేపథ్య సంగీతం (శాంతను మొయిత్రా) అవార్డు దక్కించుకుంది. చిత్రంలో కీలకపాత్ర పోషించిన అంజలి పాటిల్‌కు స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. ఈ చిత్ర దర్శకుడు - రాజేష్ టచ్‌రివర్.

ప్రతిభ

**జనవరి** 20

హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని గవర్నర్ నరసింహన్ ఆవిష్కరించారు. జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహం పక్కనే ఈ విగ్రహాన్ని నెలకొల్పారు.



**ఫిబ్రవరి** 19

రాష్ట్ర విభజనను నిరసిస్తూ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి రాజీనామా చేశారు. ఆయన తన సీఎం పదవితో పాటు కాంగ్రెస్ పార్టీకి, ఎమ్మెల్యే పదవికి కూడా గుడ్‌బై చెప్పారు.



**మే** 25

రాష్ట్రానికి చెందిన మలావత్ పూర్ణ, సాధనపల్లి ఆనంద్ కుమార్ ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి రికార్డు సృష్టించారు. పూర్ణ నిజామాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థిని. ఆనంద్ ఖమ్మం జిల్లాకు చెందిన విద్యార్థి.



**జులై** 24

బతుకమ్మను తెలంగాణ రాష్ట్ర పండుగగా ప్రకటించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో ఈ పండుగకు ఉన్న ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.



**ఆగస్టు** 23

ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార పండుగగా ప్రకటించింది. రాజమండ్రి విమానాశ్రయానికి, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనున్న ఎయిమ్స్ స్థాయి వైద్య సంస్థకు ఆయన పేరు పెట్టనున్నారు.



**అక్టోబరు** 12

హుద్‌హుద్ తుపాను విలయం సృష్టించింది. కనీవినీ ఎరుగని రీతిలో వీచిన ఈదురుగాలులు, అంతకంటే తీవ్రమైన కుంభవృష్టి విశాఖపట్నం జిల్లాను అతలాకుతలం చేశాయి. హుద్‌హుద్ అనేది ఇజ్రాయెల్ దేశ జాతీయ పక్షి.



**డిసెంబరు** 20

'జాతీయ వారసత్వ పట్టణ అభివృద్ధి, పునరుత్తేజిత యోజన - హృదయ్'కు దేశవ్యాప్తంగా ఎంపికైన 12 పట్టణాల్లో ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, తెలంగాణలోని వరంగల్ చోటు దక్కించుకున్నాయి.





## జనవరి

**10.** హైదరాబాద్ ఈసీఐఎల్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రిసెర్చ్ (టీఐఎఫ్ఆర్) బెలూన్ ఫెసిలిటీ విభాగం చేపట్టిన పాలిథిన్ ప్రయోగం విజయవంతమైంది. 'హై ఆల్టిట్యూడ్ అసెంట్-3 ప్రాజెక్టు' పేరుతో జరిపిన ఈ ప్రయోగంలో బెలూన్ 2 గంటల 9 నిమిషాల్లో 51.661 కి.మీ. ఎత్తు పయనించింది.

**22.** రాష్ట్ర విభజన ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను రెండు రాష్ట్రాలకు పంచేందుకు కేంద్ర హోంశాఖ సి.ఆర్. కమల్‌నాథన్ కమిటీని నియమించింది.

**26.** ఆంధ్రప్రదేశ్ మొత్తం అప్పులు రూ. లక్షా 94 వేల కోట్లుగా ఆర్‌బీఐ వెల్లడించింది. దీన్ని రాష్ట్ర జనాభా 8.46 కోట్లకు విభజిస్తే తలసరి అప్పు రూ. 22,938గా తేలింది.

**30.** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ బిల్లును శాసనసభ, శాసనమండలి తిరస్కరించాయి.

## ఫిబ్రవరి

**17.** 2012-13 సంవత్సరానికి ఉత్తమ వారసత్వ నగరంగా (హెరిటేజ్ సిటీ) కేంద్ర ప్రభుత్వం తిరుపతిని ఎంపిక చేసింది.

**18.** 2012-13 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్ 6 జాతీయ పర్యటక పురస్కారాలను గెలుచుకుంది. మధ్యప్రదేశ్‌తో కలిపి ఆంధ్రప్రదేశ్ అయిదో ఉత్తమ పర్యటక రాష్ట్రం పురస్కారాన్ని దక్కించుకుంది. ఉత్తమ వారసత్వ నగరంగా తిరుపతి, అత్యుత్తమ విమానాశ్రయంగా హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నిలిచాయి. వికలాంగులకు అనువుగా నడకదారి నిర్మించిన గోల్కొండ కోట ఉత్తమ కోటగా ఎంపికైంది. ఇంకా బెస్ట్ ఫిల్మ్ ప్రమోషన్, ఫ్రెండ్లీ స్టేట్ విభాగాల్లో రాష్ట్రానికి పురస్కారాలు దక్కాయి.

**27.** ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మొత్తం 18,594 గిరిజన ఆవాసాల్లో కేవలం 9,859 ఆవాసాలకు మాత్రమే తాగునీరు అందుబాటులో ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది.

**28.** ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది.

## మార్చి

**1.** ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లు-2014, ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన అనే రెండు ముఖ్య అంశాలకు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదముద్ర వేశారు. ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించడం ఇది రెండోసారి. జై ఆంధ్ర ఉద్యమ సమయంలో 1973 జనవరి 11 నుంచి డిసెంబరు 10 వరకు రాష్ట్రపతి పాలన విధించారు. ఆంధ్రప్రదేశ్ ఏర్పడక ముందు ఆంధ్ర రాష్ట్రంలో 1954 నవంబరు 15 నుంచి 1955 మార్చి 29 వరకు రాష్ట్రపతి పాలన విధించారు.

**7.** రాష్ట్ర విపత్తు స్పందనా దళం (ఎస్‌డిఆర్ఎఫ్) కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించారు.

**11.** వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కాత్యాయని విద్మహేకు 2013 సంవత్సరానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈమె రచించిన 'సాహిత్యాకాశంలో సగం' పుస్తకానికి ఈ అవార్డు లభించింది.

## ఏప్రిల్

**15.** సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతిని రాష్ట్ర ప్రభుత్వం తెలుగు నాటక రంగ దినోత్సవంగా అధికారికంగా ప్రకటించింది.

**16.** కాగితం తయారీలో వినియోగించే సరుగుడు మొక్కలను ఉత్పత్తి చేసే అతిపెద్ద కేంద్రాన్ని ఇంటర్నేషనల్ పేపర్ ఏపీపీఎం (ఆంధ్ర పేపర్స్) విశాఖ జిల్లాలో ఏర్పాటు చేసింది.

**24.** ప్రపంచ ప్రఖ్యాత రామోజీ ఫిల్మ్‌సిటీలో 'వింగ్స్' పేరిట పక్షుల ప్రపంచాన్ని ఏర్పాటు చేశారు.

**28.** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీని రద్దు చేసి, రాష్ట్రపతి పాలన కొనసాగించాలన్న కేంద్ర మంత్రివర్గ నిర్ణయానికి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదముద్ర వేశారు.

## మే

**10.** ఆంధ్రప్రదేశ్ పునర్విభజన నేపథ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన తలసరి ఆదాయ వివరాలను ప్రణాళికా శాఖ వెల్లడించింది. తెలంగాణ సరాసరి తలసరి ఆదాయం రూ. 73,930. ఆంధ్రప్రదేశ్ సరాసరి తలసరి ఆదాయం రూ. 66,754.

**13.** దక్షిణ మధ్య రైల్వే మొట్టమొదటి డబుల్ డెక్కర్ రైలు కాచిగూడ - గుంటూరు మధ్య ప్రారంభమైంది.

**28.** ఖమ్మం జిల్లాలోని పోలవరం ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌లో చేర్చడానికి కేంద్ర ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్‌ను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఆమోదించారు.

**30.** తెలంగాణ ప్రభుత్వ కొత్త అధికార చిహ్నానికి గవర్నర్ నరసింహన్ ఆమోదం తెలిపారు. కాకతీయ తోరణం, దానిపై నాలుగు సింహాల జాతీయ చిహ్నం, మధ్యభాగంలో చార్మినార్, తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో తెలంగాణ ప్రభుత్వం పేరును ఈ చిహ్నంలో పొందుపరిచారు. తెలంగాణ రాష్ట్ర గీతంగా జయజయహే తెలంగాణ, రాష్ట్ర పక్షిగా పాలపిట్ట ప్రతిపాదనలకు కూడా గవర్నర్ ఆమోదం తెలిపారు.

## జూన్

**2.** భారతదేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించింది. తెలంగాణ ప్రజల చిరకాల కాంక్షను నిజం చేస్తూ 10 జిల్లాలతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా అవతరించింది. తొలి ముఖ్యమంత్రిగా కె. చంద్రశేఖరరావు బాధ్యతలు చేపట్టారు.

**3.** రాష్ట్ర విభజన నేపథ్యంలో జూన్ 1 అర్ధరాత్రి నాటికి ఉమ్మడి రాష్ట్ర ఖజానాలో ఉన్న రూ. 6,100 కోట్లను భారతీయ రిజర్వ్ బ్యాంక్ జనాభా ప్రాతిపదికన రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసింది. దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు 58.32 శాతం చొప్పున, తెలంగాణకు 41.68 శాతం చొప్పున నిధులు పంపిణీ అయ్యాయి.

**8.** నూతన రూపు సంతరించుకున్న ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టారు.

**10.** తెలంగాణ తొలి సభాపతిగా సిరికొండ మధుసూదనాచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**20.** నవ్యాంధ్రప్రదేశ్ తొలి స్పీకర్‌గా కోడెల శివప్రసాదరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**27.** తూర్పు గోదావరి జిల్లా మామిడికుదురు మండలం నగరం గ్రామంలో గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (GAIL - గెయిల్) పైప్‌లైన్ విస్ఫోటం చెందిన ఘటనలో 20 మంది మరణించారు.

## జులై

**2.** తెలంగాణ శాసనమండలి తొలి ఛైర్మన్‌గా కె.స్వామిగౌడ్ ఎన్నికయ్యారు.

**11.** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రానికి 'సన్‌రైజ్ స్టేట్' అనే బ్రాండ్‌నేమ్‌ను ఎంపిక చేశారు.

**23.** విశాఖపట్నం సమీపంలోని ఎర్రమట్టి దిబ్బలను కేంద్ర ప్రభుత్వం, 'భూ విజ్ఞాన వారసత్వ ప్రదేశం' (జియోలాజికల్ హెరిటేజ్ సైట్)గా గుర్తించింది.

**24.** మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం మాసాయిపేటలో కాపలాలేని రైల్వే క్రాసింగ్ వద్ద స్కూలు బస్సును నాందేడ్ ప్యాసింజర్ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 16 మంది పాఠశాల విద్యార్థులు సహా 18 మంది దుర్మరణం చెందారు.

## ఆగస్టు

**7.** హైదరాబాద్ మెట్రో రైలును ప్రయోగాత్మకంగా పరీక్షించారు. నాగోల్ - మెట్టుగూడ మార్గంలో మెట్రోరైలు తొలిసారిగా పరుగులు తీసింది.

**17.** రాష్ట్ర గవర్నర్ నరసింహన్ సమక్షంలో హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన ఉన్నత స్థాయి అధికారిక సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య వివాదాస్పద అంశాల పరిష్కారానికి గవర్నర్ నరసింహన్ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

**19.** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే విజయవంతంగా జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు కోటి కుటుంబాలు సర్వేలో పాల్గొన్నాయి.

**20.** విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి బడ్జెట్‌ను ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు రూ. 1,11,824 కోట్ల మొత్తంతో శాసనసభలో ప్రవేశపెట్టారు.

## సెప్టెంబరు

**1.** ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ, విజయవాడల్లో తలపెట్టిన మెట్రోరైలు ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ)కి అప్పగించింది. డీఎంఆర్‌సీ ముఖ్య సలహాదారు ఇ. శ్రీధరన్‌ను ఏపీ మెట్రో రైల్ ప్రాజెక్టు సలహాదారుగా నియమించింది.

**4.** ఆంధ్రప్రదేశ్‌కు కొత్త రాజధానిగా విజయవాడ పరిసర ప్రాంతాలను ఎంపిక చేసినట్లు సీఎం చంద్రబాబు శాసనసభలో ప్రకటించారు.

**9.** కాళోజీ శతజయంతి వేడుకలను తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. కాళోజీ జయంతిని ఏటా తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారు.

**12.** హైదరాబాద్ మెట్రోరైలు మస్కట్‌గా 'నిజ్'ను ఎంపిక చేశారు. నగరానికి ఉన్న నాలుగు వందల ఏళ్ల ఘన చరిత్రను, సంస్కృతిని, వారసత్వాన్ని ప్రతిబింబించేలా, నాటి నిజాం ప్రభువుల రాజసం ఉట్టిపడేలా 'నిజ్'ను తీర్చిదిద్దారు.

**27.** హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం 'సప్తగిరి' రెండుగా విడిపోయింది. ప్రస్తుత 'సప్తగిరి' ఛానల్ అదే పేరుతో విజయవాడ కేంద్రంగా కార్యకలాపాలు ప్రారంభించింది. తెలంగాణ ప్రజల కోసం దూరదర్శన్ 'యాదగిరి' పేరిట సరికొత్త ఛానెల్ ప్రారంభమైంది.

## అక్టోబరు

**6.** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన ఏడు మిషన్లలో మొదటిదైన ప్రాథమిక రంగ మిషన్ (ప్రాథమిక రంగం విధాన పత్రం)ను అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని గరుడాపురంలో సీఎం చంద్రబాబు నాయుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం సంయుక్తంగా ప్రారంభించారు.

**8.** ఆదిలాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్‌లో కొమురం భీమ్ 74వ వర్ధంతి సభను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది.

**13.** మెదక్ జిల్లా సిద్ధిపేట మార్కెట్‌యార్డులో రూ. 5కే భోజనం అందించే 'సద్దిమూట'; మాతా శిశు సంరక్షణ, ప్రాంతీయ ఆసుపత్రుల్లో రోగుల సహాయకులకు ఇచ్చే 'భోజనామృతం' కార్యక్రమాలను తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించింది.

**20.** దక్కన్ గ్రామీణ బ్యాంక్ పేరును తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌గా మారుస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్ పరిధిలో ఉన్న అయిదు తెలంగాణ జిల్లాలను తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలోకి తెచ్చింది.

## నవంబరు

**5.** తెలంగాణ తొలి బడ్జెట్‌ను ఆర్థికమంత్రి ఈటెల రాజేందర్ రూ. 1,00,637.96 కోట్ల మొత్తంతో శాసనసభలో ప్రవేశపెట్టారు.

**7.** వ్యవసాయాభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హరిత (హార్మోనైజ్డ్ ఇన్ఫర్మేషన్ ఆఫ్ అగ్రికల్చర్, రెవెన్యూ, ఇరిగేషన్ ఫర్ ఎ ట్రాన్స్‌ఫార్మేషన్ ఎజెండా) పేరుతో కొత్త పథకానికి రూపకల్పన చేసింది.

**17.** తెలంగాణ రాష్ట్ర జంతువుగా జింక, రాష్ట్ర వృక్షంగా జమ్మిచెట్టు, రాష్ట్ర పుష్పంగా తంగేడు పువ్వును సీఎం కేసీఆర్ ఖరారు చేశారు.

## డిసెంబరు

**5.** ఆంధ్రప్రదేశ్‌లో కాలువపై తొలి సౌర విద్యుత్ ప్రాజెక్టును పశ్చిమ గోదావరి జిల్లా గొల్లవానిపిప్ప సమీపంలో లోసరి కాలువపై ఏర్పాటు చేసేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది.

**15.** తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నియమితులయ్యారు.

**17.** తెలంగాణ తొలి పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఛైర్మన్‌గా ఆచార్య ఘంటా చక్రపాణి నియమితులయ్యారు.

# 2014 అవార్డులు

**నవంబరు 4**



**ఇంటెల్ నిర్వహించిన 'మేక్ ఇట్ వియరబుల్' పోటీలో 'నిక్సీ' అనే డ్రోన్‌కు ప్రథమ బహుమతి దక్కింది. ఇది చేతికి గడియారంలా చుట్టుకుని అవసరమైనప్పుడు గాల్లోకి ఎగిరి, మనల్ని అనుసరిస్తూ స్వీయ చిత్రాలు (సెల్ఫీలు) తీయగలదు. ఈ బహుమతి విలువ రూ. 3 కోట్లు.**



ప్రతిభ

### జనవరి

25. ప్రభుత్వం ఈ ఏడాది మొత్తం 127 మందికి పద్మ అవార్డులను ప్రకటించింది (పద్మవిభూషణ్ - 2, పద్మ భూషణ్ - 24, పద్మశ్రీ - 101). అంతరిక్ష పరిశోధకుడు రఘునాథ్ ఏ మషేల్కర్, యోగా గురువు బీకేఎస్ అయ్యంగార్‌లకు పద్మవిభూషణ్ ప్రకటించింది.
26. 65వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గ్రే హౌండ్స్ ఆర్ఐ కె. ప్రసాద్‌బాబుకు మరణానంతరం అశోకచక్ర పురస్కారాన్ని ప్రకటించారు.

### ఫిబ్రవరి

4. ప్రముఖ క్రికెటర్ సచిన్ తెందుల్కర్, ప్రముఖ శాస్త్రవేత్త సీఎన్ఆర్ రావులకు రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నను ప్రదానం చేశారు.
8. పాకిస్థానీ బాలిక మలాలా యూసఫ్ జాయ్‌తోపాటు జాన్ ఉడ్ (అమెరికా), ఇందిరా రానామగర్ (నేపాల్)లకు ప్రతిష్ఠాత్మక బాలల నోబెల్ పురస్కారాన్ని ప్రకటించారు.

### మార్చి

3. 86వ ఆస్కార్ అవార్డులను లాస్ ఏంజెల్స్‌లో ప్రదానం చేశారు. ఉత్తమ చిత్రంగా '12 ఇయర్స్ ఎ స్లేవ్' నిలిచింది. ఉత్తమ నటుడు - మాథ్యూ మెక్ కొనావ్ గె, ఉత్తమ నటి - కేట్ బ్లాన్ చెట్.
10. కవి, పరిశోధకుడు, బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌కు కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద సాహిత్యంలో జాతీయ పురస్కారాన్ని ప్రకటించింది.

### ఏప్రిల్

12. భారతీయ సినీ, సాహిత్య రంగాల్లో విశేష కృషి చేసిన గుల్జార్‌కు కేంద్రం దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని (45వది) ప్రకటించింది. ఈయన అసలు పేరు సంపూరణ్ సింగ్. గుల్జార్ అనేది కలం పేరు.
15. భారత్‌లో జన్మించి, అమెరికాలో స్థిరపడిన కవి విజయ్ శేషాద్రి ప్రతిష్ఠాత్మక పులిట్జర్ పురస్కారానికి ఎంపికయ్యారు. 'త్రీ సెక్షన్స్' పేరుతో ఆయన రాసిన కవితా సంపుటికి ఈ పురస్కారం దక్కింది.
16. 61వ జాతీయ చలన చిత్ర అవార్డులను ప్రకటించారు. 'షిప్ ఆఫ్ థీసియస్' ఉత్తమ చిత్రంగా నిలిచింది. రాజ్‌కుమార్ యాదవ్, సూరజ్ వెంజరాముడు సంయుక్తంగా 'ఉత్తమ నటుడు' అవార్డుకు ఎంపికయ్యారు. ఉత్తమ నటి - గీతాంజలి థాపా.

### మే

5. టాటా గ్రూప్ గౌరవ ఛైర్మన్ రతన్ టాటా బ్రిటన్‌లో అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన నైట్ గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద బ్రిటిష్ ఎంపైర్ (జీబీఈ)ను గెలుచుకున్నారు.
25. ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో ముగిసిన 67వ కేన్స్ అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో ఉత్తమ చిత్రం అవార్డును 'వింటర్ స్లీప్' అనే టర్కిష్ చిత్రం గెలుచుకుంది.

### జూన్

19. భారత్‌లో పుట్టి అమెరికాలో స్థిరపడిన సంజయ్ రాజారామ్ అనే వృక్షశాస్త్రవేత్త ప్రపంచ ఆహార పురస్కారం-2014కు ఎంపికయ్యారు.
20. ప్రముఖ హిందీ కవి కేదార్‌నాథ్ సింగ్‌కు 2013 సంవత్సరానికి 49వ జ్ఞానపీఠ్ అవార్డును ప్రకటించారు.

### జులై

11. ప్రతిష్ఠాత్మక 'జార్జ్ పోల్యా ప్రైజ్'ను ఈ ఏడాదికి భారతీయ యువగణిత శాస్త్రవేత్త నిఖిల్ శ్రీవాస్తవ మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా గెలుచుకున్నారు.
15. 2013 అంతర్జాతీయ గాంధీ శాంతి బహుమతిని రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు చండీప్రసాద్ భట్‌కు ప్రదానం చేశారు.

### ఆగస్టు

12. ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ, కాంగ్రెస్ సీనియర్ నేత కరణ్‌సింగ్, జేడీయూ అధినేత శరద్‌యాదవ్‌లకు వరుసగా 2010, 2011, 2012 సంవత్సరాలకు ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారాలను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ ఢిల్లీలో ప్రదానం చేశారు.
20. ప్రముఖ సినీ దర్శకుడు ముజఫర్ అలీకి రాజీవ్ గాంధీ జాతీయ సద్భావనా పురస్కారం-2014ను కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఢిల్లీలో ప్రదానం చేశారు.
29. జాతీయ క్రీడా పురస్కారాలను రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ న్యూఢిల్లీలో ప్రదానం చేశారు.

### సెప్టెంబరు

25. ప్రముఖ ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్తలు, సోదరులైన జి.పి. హిందుజా, ఎస్.పి. హిందుజాలకు లండన్‌లోని ఇండో యూరోపియన్ బిజినెస్ ఫోరం (ఐఈబీఎఫ్) 'వ్యాపార రంగంలో జీవితకాల సాఫల్య పురస్కారం'ను ప్రదానం చేసింది.
27. ఉత్తర్ ప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన 14 ఏళ్ల విద్యార్థి అభిషేక్‌కు సుప్రసిద్ధ యునిసెఫ్ 'మీనా రతన్' పురస్కారం లభించింది.

### అక్టోబరు

4. భారతీయ అమెరికన్ ప్రొఫెసర్ థామస్ కైలాథ్‌కు అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా ప్రతిష్ఠాత్మక జాతీయ సైన్స్ అవార్డును ప్రకటించారు.
6. బ్రిటన్-అమెరికన్ జాన్ ఓ కీఫె, నార్వే జంట ఎడ్వర్డ్ మోసర్, మే-బ్రిట్ మోసర్ వైద్యశాస్త్రంలో నోబెల్ బహుమతి గెలుచుకున్నారు.
7. జపాన్ పరిశోధకులు ఇసాము అకసాకి, హిరోషి అమానో, జపాన్-అమెరికన్ షుజి నకామురా భౌతిక శాస్త్ర విభాగంలో నోబెల్‌కు ఎంపికయ్యారు.
8. అమెరికా శాస్త్రవేత్తలు ఎరిక్ బెట్జిగ్, విలియం మోర్నర్, జర్మన్ పరిశోధకుడు స్టీఫెన్ హెల్ రసాయనశాస్త్ర విభాగంలో నోబెల్ దక్కించుకున్నారు.
9. ఫ్రాన్స్ నవలా రచయిత ప్యాట్రిక్ మోడియానోకు నోబెల్ సాహితీ పురస్కారం ప్రకటించారు.
10. భారత్‌కు చెందిన కైలాష్ సత్యార్థి, పాకిస్థాన్‌కు చెందిన మలాలా యూసఫ్ జాయ్ లకు నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించారు.
13. ఫ్రాన్స్ ఆర్థికవేత్త జీన్ టిరోల్‌కు ఆర్థికశాస్త్రంలో నోబెల్ ప్రకటించారు.
15. ప్రతిష్ఠాత్మక మ్యాన్ బుకర్ ప్రైజ్-2014 ను ఆస్ట్రేలియా నవలాకారుడు రిచర్డ్ ఫ్లానగన్‌కు లండన్‌లో ప్రదానం చేశారు.

### నవంబరు

19. ఇందిరాగాంధీ శాంతి, నిరాయుధీకరణ, అభివృద్ధి అవార్డును 2014 సంవత్సరానికి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు ప్రకటించారు.
21. కల్నల్ సీకే నాయుడు జీవితకాల సాఫల్య పురస్కారాన్ని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ దిలీప్ వెంగ్‌సర్కార్‌కు ప్రదానం చేశారు.

### డిసెంబరు

11. క్యూబా కమ్యూనిస్టు దిగ్గజం ఫిడేల్ క్యాస్ట్రోకు 2014 సంవత్సరానికి చైనా శాంతి బహుమతి ప్రకటించారు.
19. ప్రముఖ తెలుగు రచయిత, విమర్శకుడు డాక్టర్ రాచపాళెం చంద్రశేఖర రెడ్డికి కేంద్ర సాహిత్య అకాడమీ 'ఉత్తమ విమర్శకుడు' అవార్డు లభించింది.

# 2014 సైన్స్ & టెక్నాలజీ

### జనవరి

5. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన క్రయో ఇంజిన్‌తో జీఎస్ఎల్‌వీ-డి5 ను ఇస్రో రోదసిలోకి ప్రవేశపెట్టింది. జీశాట్-14 ఉపగ్రహాన్ని జీఎస్ఎల్‌వీ-డి5 నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది.
20. అణ్వస్త్రాన్ని మోసుకెళ్లగల వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణి అగ్ని-4ను వీలర్ ఐలాండ్ (ఒడిశా)లోని ఇంటెగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ (ఐటీఆర్) నుంచి విజయవంతంగా ప్రయోగించారు. ఈ క్షిపణి పరిధి 4 వేల కి.మీ.

### ఫిబ్రవరి

6. తొలిసారిగా సాల్వోమోడ్ (ఒకేసారి సమాంతరంగా క్షిపణులను ప్రయోగించడం) పద్ధతిలో నిర్వహించిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణి పరీక్ష విజయవంతమైంది.

### మార్చి

1. బ్రిటన్‌లోని హైబ్రిడ్ ఎయిర్ వెహికిల్స్ సంస్థ రూపొందించిన 'ఎయిర్ లాండర్' అనే విమానం ప్రపంచంలోనే అతి పెద్దదిగా గుర్తింపు పొందింది. దీని పొడవు 300 అడుగులు, వెడల్పు 113 అడుగులు, ఎత్తు 85 అడుగులు.
7. సాంకేతిక రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు గూగుల్ 10 లక్షల డాలర్ల వ్యయంతో '# 40 ఫార్వర్డ్' అనే కార్యక్రమాన్ని చేపట్టింది.
28. పృథ్వి -II క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. దీని పరిధి 350 కి.మీ.

### ఏప్రిల్

4. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ-సి24 ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. 1432 కిలోల ఐఆర్ఎన్ఎస్ఎస్-1బి ఉపగ్రహాన్ని ఇది విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది.
27. భారత్ తొలిసారిగా పృథ్వి డిఫెన్స్ వెహికిల్ (పీడీవీ) ను ఒడిశాలోని వీలర్ ఐలాండ్ వద్ద విజయవంతంగా ప్రయోగించింది.

### మే

11. ఐరోపా శాస్త్రవేత్తలు విమానాల్లో ఉపయోగించే జెట్ ఇంధనాన్ని పర్యావరణ అనుకూల విధానాల్లో తొలిసారిగా కృత్రిమంగా తయారు చేశారు.

### జూన్

14. భారత్‌కు చెందిన అత్యంత భారీ యుద్ధనౌక 'ఐఎన్ఎస్ విక్రమాదిత్య'ను ప్రధాని నరేంద్ర మోదీ గోవా తీరంలో జాతికి అంకితం చేశారు.
30. ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్‌వీ-సీ23 ప్రయోగం విజయవంతమైంది. దీని ద్వారా ఫ్రాన్స్‌కు చెందిన ఉపగ్రహం స్పాట్-7తో పాటు కెనడా, సింగపూర్, జర్మనీలకు చెందిన మరో నాలుగు బుల్లి ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టారు.

### జులై

25. విపత్తులు, ప్రమాదాల సమయంలో వ్యవస్థలు కుప్పకూలిన చోట అండగా నిలిచే అత్యాధునిక సమాచార వ్యవస్థ దిశానెట్ (ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ ఫర్ నేచురల్ డిజాస్టర్ మిటిగేషన్ అండ్ రికవరీ ప్రాజెక్ట్)ను భారత్, జపాన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా రూపొందించారు.

### ఆగస్టు

7. అంతరిక్షంలో ఓ తోకచుక్కను వెంటాడుతూ పదేళ్లుగా నిరంతరాయంగా ప్రయాణిస్తున్న రోసెట్టా వ్యోమనౌక ఎట్టకేలకు తన లక్ష్యాన్ని సాధించింది. రోసెట్టా పదేళ్ల కాలంలో ఏకంగా 640 కోట్ల కిలోమీటర్లు ప్రయాణించి '67 పీ/చుర్యుమోవ్ - గెరాసిమెంకో' అనే తోకచుక్కను విజయవంతంగా చేరుకుంది.
9. శాస్త్రీయ ప్రయోగాలు నిర్వహించడానికి, ప్రకృతి విపత్తుల సమయంలో ముందస్తు హెచ్చరికలు చేయడానికి చైనా 'యావోగాన్-20' అనే రిమోట్ సెన్సింగ్ ఉపగ్రహాన్ని ప్రయోగించింది.

### సెప్టెంబరు

6. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) రక్షణ కోసం మినీ రోబోలను తయారు చేసినట్లు మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) శాస్త్రవేత్తలు ప్రకటించారు.
12. కాళ్లు లేని ఆవుల కోసం జైపూర్‌లోని భగవాన్ మహావీర్ వికలాంగ సమితి (బీఎంవీఎస్) కృత్రిమ కాళ్లను ఆవిష్కరించింది.

### అక్టోబరు

1. మైక్రోసాఫ్ట్ సంస్థ విండోస్ 10 వెర్షన్‌ను విడుదల చేసింది.

★ ఖండాంతర అణ్వస్త్ర క్షిపణి 'డాంగ్ ఫెంగ్-31బీ'ని చైనా విజయవంతంగా పరీక్షించింది. ఈ క్షిపణి 10 వేల కి.మీ. దూరంలోని లక్ష్యాలను కచ్చితత్వంతో ఛేదిస్తుంది.

13. కేవలం రెండు రూపాయల ఖర్చుతో గర్భాశయ క్యాన్సర్‌ను గుర్తించగలిగే అత్యంత చవకైన పద్ధతిని ఢిల్లీలోని శ్రీ గంగారాం ఆసుపత్రి వైద్యులు అభివృద్ధి చేశారు. దీనికి 'విజువల్ ఇన్‌స్పెక్షన్ విత్ ఎసిటిక్ యాసిడ్ (వీఐఏ)' అనే పేరు పెట్టారు.
16. ఇస్రో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇండియన్ రీజినల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్‌లో మూడోదైన ఐఆర్ఎన్ఎస్ఎస్-1సి ఉపగ్రహాన్ని పీఎస్ఎల్‌వీ సీ-26 రాకెట్ ద్వారా విజయవంతంగా రోదసీలోకి పంపారు.

### నవంబరు

10. శాంతా బయోటెక్నిక్స్ సంస్థ 'శాన్ 5' అనే బ్రాండ్ పేరుతో పెంటవాలెంట్ వ్యాక్సిన్‌ను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది.
15. బ్రిటన్‌కు చెందిన థాంప్సన్ అండ్ మోర్గాన్ సంస్థ 'టమ్‌టాటో' పేరిట సరికొత్త మొక్కలను అభివృద్ధి చేసింది. ఈ మొక్క ఏకకాలంలో టమోటాలు, బంగాళాదుంపలను ఉత్పత్తి చేయగలదు.
27. ఎబోలా వైరస్‌ను నివారించడానికి ప్రయోగాత్మకంగా రూపొందించిన 'ఎన్ఐఏఐడీ/ జీఎస్‌కే' ఎబోలా టీకా సురక్షితంగా పని చేస్తున్నట్లు అమెరికా శాస్త్రవేత్తలు వెల్లడించారు.

### డిసెంబరు


2. అణ్వాయుధాలను మోసుకెళ్లగల ఖండాంతర క్షిపణి అగ్ని-4ను డీఆర్‌డీఓ ఒడిశాలోని బాలాసోర్ వద్ద విజయవంతంగా ప్రయోగించింది. దీని పరిధి 4 వేల కి.మీ.
3. జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ చేపట్టిన 'హయబుస-2' ప్రయోగం విజయవంతమైంది. హెచ్-2ఏ రాకెట్ 'హయబుస-2'ను రోదసీలోకి తీసుకెళ్లింది.
7. భారత కమ్యూనికేషన్ ఉపగ్రహం జీశాట్-16ను ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి ఏరియన్-5 రాకెట్ ద్వారా ప్రయోగించారు.
18. ఇస్రో రూపొందించిన అత్యంత భారీ రాకెట్ జీఎస్ఎల్‌వీ మార్క్-3 ద్వారా కేర్ (క్రూ మాడ్యూల్ అట్మాస్ఫెరిక్ రీ ఎంట్రీ ఎక్స్‌పరిమెంట్) ను విజయవంతంగా పరీక్షించారు.

**ఆగస్టు 6**



**భారతీయ యువ రచయిత నిఖిల్ చంద్వానీకి ప్రసిద్ధ అమెరికన్ లిటరరీ ఫోరం సొసైటీ పురస్కారం లభించింది. నిఖిల్ రచించిన 'కోడెడ్ కాన్స్పిరసీ' అనే నవలకు ఈ అవార్డు దక్కింది.**

**సెప్టెంబరు 20**



**ప్రతిష్ఠాత్మక అక్కినేని నాగేశ్వరరావు జాతీయ అవార్డును 2013 సంవత్సరానికి ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్‌కు ప్రకటించారు. ఈ అవార్డును 2005 నుంచి ఇస్తున్నారు.**

**మే 23**



**అమెరికా అంతరిక్ష సంస్థ నాసా తొలిసారిగా భూమికి సంబంధించిన 'సెల్ఫీ చిత్రాన్ని' విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా 113 దేశాలు, ప్రాంతాలకు చెందిన దాదాపు 36వేల మంది తీసిన ఫొటోలను కలిపి దీన్ని తీశారు.**

**సెప్టెంబరు 24**



**2013 నవంబరు 5న భారత్ ప్రయోగించిన మార్స్ ఆర్బిటర్ మిషన్ (మంగళయాన్) 66.6 కోట్ల కి.మీ.ల దూరం ప్రయాణించి అంగారక కక్ష్యలోకి చేరుకుంది. తొలి యత్నంలోనే ఈ ఘనత సాధించిన తొలి దేశం మనదే.**

# 2014 క్రీడలు



జనవరి 1

**క్వీన్స్ టౌన్‌లో వెస్టిండీస్-న్యూజిలాండ్ మధ్య జరిగిన వన్డే మ్యాచ్‌లో న్యూజిలాండ్ బ్యాట్స్‌మన్ కోరె అండర్సన్ 36 బంతుల్లోనే శతకం సాధించి ప్రపంచ ఫాస్టెస్ట్ సెంచరీని నమోదు చేశాడు.**

ప్రతిభ

## జనవరి

4. షార్జాలో జరిగిన అండర్-19 ఆసియా క్రికెట్ కప్ టోర్నీ విజేతగా భారత్ నిలిచింది. ఫైనల్లో పాకిస్థాన్‌పై నెగ్గింది.
15. ప్రపంచ అత్యుత్తమ ఫుట్‌బాలర్‌కు ఇచ్చే ఫిఫా 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును 2013 ఏడాదికి పోర్చుగల్ క్రీడాకారుడు క్రిస్టియానో రోనాల్డ్ గెలుచుకున్నాడు.
26. ఆస్ట్రేలియన్ ఓపెన్-2014 విజేతగా స్టానిస్లాస్ వావ్రింకా (స్విట్జర్లాండ్) నిలిచాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను లినా (చైనా) నెగ్గింది.

## ఫిబ్రవరి

8. రష్యాలోని సోచిలో వింటర్ ఒలింపిక్స్ ప్రారంభమయ్యాయి. తొలి స్వర్ణాన్ని అమెరికా నెగ్గింది.
23. సోచి వింటర్ ఒలింపిక్స్ ముగిశాయి. ఈ పోటీల్లో ఆతిథ్య రష్యా అత్యధికంగా 13 స్వర్ణాలతోపాటు మొత్తం 33 పతకాలు సాధించి అగ్రస్థానంలో నిలిచింది.

★ హాకీ ఇండియా లీగ్-2 విజేతగా దిల్లీ వేవ్‌రైడర్స్ నిలిచింది. రాంచీలో జరిగిన ఫైనల్లో 3-1తో పంజాబ్ వారియర్స్‌ను ఓడించింది.

## మార్చి

1. అండర్-19 క్రికెట్ ప్రపంచకప్ విజేతగా దక్షిణాఫ్రికా నిలిచింది. దుబాయ్‌లో జరిగిన ఫైనల్లో 6 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై నెగ్గింది.
8. ఆసియా కప్ క్రికెట్ టోర్నీ విజేతగా శ్రీలంక నిలిచింది. బంగ్లాదేశ్‌లో జరిగిన ఫైనల్లో 5 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై నెగ్గింది.
9. సంతోష్ ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీ-2014 విజేతగా మిజోరం జట్టు నిలిచింది.
10. భారత షూటింగ్ క్రీడాకారిణి హీనా సిద్ధు కువైట్‌లో జరిగిన ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్ (మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగం)లో స్వర్ణం నెగ్గింది.

## ఏప్రిల్

6. ఐసీసీ ప్రపంచ టీ20 కప్‌ను శ్రీలంక నెగ్గింది. ఢాకాలో జరిగిన ఫైనల్లో శ్రీలంక 6 వికెట్ల తేడాతో భారత్‌పై నెగ్గింది. మహిళల టోర్నీ విజేతగా ఆస్ట్రేలియా వరుసగా మూడోసారి నిలిచింది.
12. అమెరికాలో జరిగిన అంతర్జాతీయ షూటింగ్ క్రీడాసమాఖ్య షాట్‌గన్ ప్రపంచ కప్‌లో మానవ్‌జిత్ సింగ్ సంధూ స్వర్ణాన్ని నెగ్గాడు.
22. భారత్‌కు చెందిన స్నూకర్ క్రీడాకారిణి చిత్ర మగిమైరాజ్ ప్రపంచ మహిళల సీనియర్ స్నూకర్ టైటిల్ నెగ్గింది.

## మే

24. ఉబెర్ కప్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతగా చైనా నిలిచింది. చైనా ఉబెర్ కప్ విజేతగా నిలవడం ఇది 13వసారి.

★ 2014 సంవత్సరానికి ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య అవార్డును మలేషియా క్రీడాకారుడు లీ చోంగ్‌లీకి ప్రదానం చేశారు. మహిళల విభాగంలో ఈ పురస్కారం లీజురుయ్ (చైనా)కి దక్కింది.

25. అంతర్జాతీయ పురుషుల టీమ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 'థామస్ కప్'ను జపాన్ చేజిక్కించుకుంది. దిల్లీలో జరిగిన ఫైనల్లో 3-2తో మలేషియాను ఓడించింది.

## జూన్

1. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-7 విజేతగా కోల్‌కతా నైట్‌రైడర్స్ నిలిచింది. బెంగళూరులో జరిగిన ఫైనల్లో పంజాబ్ కింగ్స్ ఎలెవన్ జట్టుపై నెగ్గింది.
8. ఫ్రెంచ్ ఓపెన్-2014ను స్పెయిన్ క్రీడాకారుడు రఫెల్ నాదల్ నెగ్గాడు. మహిళల టైటిల్‌ను మరియా షరపోవా (రష్యా) నెగ్గింది.
15. పురుషుల హాకీ ప్రపంచ కప్‌ను ఆస్ట్రేలియా తిరిగి నిలబెట్టుకుంది.



జులై 6

**వింబుల్డన్-2014 విజేతగా నోవాక్ జకోవిచ్ (సెర్బియా) నిలిచాడు. మహిళల టైటిల్‌ను చెక్ రిపబ్లిక్ క్రీడాకారిణి పెట్రా క్విటోవా నెగ్గింది.**

18. దుబాయ్‌లో జరిగిన ప్రపంచ ర్యాపిడ్ చెస్ ఛాంపియన్‌షిప్ విజేతగా నార్వే క్రీడాకారుడు మాగ్నస్ కార్ల్‌సన్ నిలిచాడు.
29. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను హైదరాబాద్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ నెగ్గింది. ఫైనల్లో కరోలినా మరిన్ (స్పెయిన్)పై విజయం సాధించింది.

## జులై

14. సాకర్ ప్రపంచకప్ - 2014ను జర్మనీ నెగ్గింది. బ్రెజిల్‌లోని రియో డిజనీరోలో జరిగిన ఫైనల్లో అర్జెంటీనాను 1-0 గోల్స్‌తో ఓడించింది.
16. టీమ్ ఇండియా మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ లారెస్ వరల్డ్ స్పోర్ట్స్ అకాడమీ కొత్త సభ్యుడిగా ఎన్నికయ్యాడు.
24. 20వ కామన్వెల్త్ గేమ్స్ గ్లాస్గోలోని సెల్టిక్ పార్కులో ప్రారంభమయ్యాయి.

## ఆగస్టు

4. గ్లాస్గో కామన్వెల్త్ క్రీడలు ముగిశాయి. పతకాల పట్టికలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, కెనడా, స్కాట్లాండ్, ఇండియాలు తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి.
30. డెన్మార్క్‌లోని కోపెన్‌హెగెన్‌లో జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మహిళల సింగిల్స్‌లో పి.వి.సింధు కాంస్యాన్ని నెగ్గింది.
31. భారత్‌లో నిర్వహించిన ప్రొ కబడ్డీ లీగ్ తొలి ఛాంపియన్‌గా జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు నిలిచింది.

★ ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌ను చెన్‌లాంగ్ (చైనా) నెగ్గాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను కరోలినా మరిన్ (స్పెయిన్) నెగ్గింది.



ఆగస్టు 23

**అంతర్జాతీయ స్నూకర్‌లో ఒక గేమ్‌లో గరిష్ఠ పాయింట్లు (147) సాధించిన భారత ఆటగాడిగా ఆదిత్య మెహతా రికార్డు సృష్టించాడు.**

## సెప్టెంబరు

9. యూఎస్ ఓపెన్ టైటిల్‌ను మారిన్ సిలిక్ (క్రొయేషియా) నెగ్గాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను సెరెనా విలియమ్స్ (అమెరికా) నెగ్గింది.
19. 17వ ఆసియా క్రీడలు దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో ప్రారంభమయ్యాయి.

## అక్టోబరు

4. ఛాంపియన్స్ లీగ్-2014 టీ20 టోర్నీ విజేతగా చెన్నై సూపర్‌కింగ్స్ నిలిచింది.

★ ఆసియా క్రీడలు ముగిశాయి. పతకాల పట్టికలో చైనా, దక్షిణ కొరియా, జపాన్ తొలి 3 స్థానాల్లో నిలిచాయి.

13. ఇటలీలో జరిగిన మహిళల ప్రపంచ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను అమెరికా జట్టు నెగ్గింది.

## నవంబరు

16. చైనా ఓపెన్ సూపర్ సిరీస్ బ్యాడ్మింటన్ టైటిల్‌ను కిదాంబి శ్రీకాంత్ గెలుచుకున్నాడు. మహిళల సింగిల్స్ టైటిల్‌ను సైనా నెహ్వాల్ నెగ్గింది.
23. రష్యాలోని సోచిలో జరిగిన ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో మాగ్నస్ కార్ల్‌సన్ విజేతగా నిలిచాడు.

## డిసెంబరు

15. విశ్వనాథన్ ఆనంద్ తొలిసారిగా లండన్ క్లాసిక్ టైటిల్ నెగ్గాడు.
17. ఆసియా క్రీడల్లో కాంస్య పతకాన్ని స్వీకరించటానికి తిరస్కరించిన భారత బాక్సర్ సరితా దేవిపై అంతర్జాతీయ బాక్సింగ్ సంఘం ఏడాది నిషేధం విధించింది.
22. భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్ 2015 వన్డే ప్రపంచకప్ ప్రచారకర్తగా ఎంపియ్యాడు.



సెప్టెంబరు 5

**యూఎస్ ఓపెన్-2014 మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్‌ను సానియా మీర్జా (భారత్), బ్రూనో సోరెస్ (బ్రెజిల్) జంట నెగ్గింది.**

# 2014 సదస్సులు-సమావేశాలు

## జనవరి

13. రాష్ట్రాల మైనారిటీ కమిషన్ల సదస్సు దిల్లీలో జరిగింది.
16. సార్క్ దేశాల 'అయిదో బిజినెస్ లీడర్స్ కాన్‌క్లేవ్'ను దిల్లీలో నిర్వహించారు. పాకిస్థాన్‌లో కార్యకలాపాలు నిర్వహించడానికి ఎస్‌బీఐ, బీఓఐలకు ఈ సమావేశంలో అనుమతి లభించింది.

★ అఫ్గనిస్థాన్ భద్రతపై చైనా రాజధాని బీజింగ్‌లో చైనా, భారత్, రష్యాల మధ్య త్రైపాక్షిక చర్చలు జరిగాయి.

22. ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశాన్ని స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో నిర్వహించారు.

## ఫిబ్రవరి

3. జమ్మూలో 101వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ జరిగింది.
12. కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) స్వర్ణోత్సవాలను దిల్లీలో ఘనంగా నిర్వహించారు.
15. ప్రపంచ పుస్తక ప్రదర్శన న్యూదిల్లీలో నిర్వహించారు.
17. బయో ఏషియా-2014 సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించారు.
23. జి-20 దేశాల ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంక్ గవర్నర్ల సమావేశాన్ని సిడ్నీలో నిర్వహించారు.



జూన్ 18

**భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, రష్యా ఉపప్రధాని దిమిత్రీ ఓ రోగోజిన్‌ల మధ్య దిల్లీలో అత్యున్నతస్థాయి సమావేశం జరిగింది.**

## మార్చి

3. బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీ సెక్టరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కో ఆపరేషన్ (BIM-STEC) శిఖరాగ్ర సదస్సును మయన్మార్‌లోని నేపితాలో నిర్వహించారు. ఇది 3వ బిమ్స్‌టెక్ సదస్సు.
11. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో ఇండియా ఏవియేషన్ 2014 సదస్సును నిర్వహించారు.
24. మూడో అంతర్జాతీయ ద్వైవార్షిక అణు రక్షణ సదస్సు నెదర్లాండ్స్‌లోని ది హేగ్‌లో జరిగింది.

## ఏప్రిల్

12. కర్బన ఉద్గారాల తగ్గింపు అంశానికి సంబంధించి ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సును బెర్లిన్‌లో నిర్వహించారు.

## మే

4. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ నేటివరకూ పలువురు రాష్ట్రపతులకు సేవలందించిన ఏడీసీ (ఎయిడ్స్-డీ-క్యాంప్) అధికారుల సమావేశం దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగింది.
5. ఆసియా అభివృద్ధి బ్యాంక్ 47వ వార్షిక సమావేశాలను కజకిస్థాన్ రాజధాని అస్తానాలో నిర్వహించారు.
27. ఎనిమిది దేశాల (ఏడు సార్క్ దేశాలు + మారిషస్) అధినేతలతో భారత నూతన ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీలో సమావేశమయ్యారు.

## జూన్

4. 40వ జీ8 సదస్సు బెల్జియం రాజధాని బ్రసెల్స్‌లో జరిగింది. ఇది రష్యాలోని సోచిలో జరగాల్సింది. అయితే, ఉక్రెయిన్‌పై రష్యా వైఖరికి నిరసనగా జీ8 దేశాలు రష్యాను తాత్కాలికంగా కూటమి నుంచి తొలగించిన నేపథ్యంలో బ్రసెల్స్‌లో నిర్వహించారు.
27. ప్రపంచ పర్యావరణ సదస్సును ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో కెన్యా రాజధాని నైరోబీలో నిర్వహించారు.




జులై 15

**బ్రిక్స్ కూటమి (BRICS- బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) 6వ సదస్సును బ్రెజిల్‌లోని ఫోర్టాలెజాలో నిర్వహించారు.**

## జులై

3. 'పట్టణ పరిపాలన, అందరికీ ఇళ్లు-అవకాశాలు, సవాళ్లు' అనే అంశంపై రాష్ట్రాల పట్టణాభివృద్ధి శాఖ మంత్రుల సదస్సును న్యూదిల్లీలో నిర్వహించారు.

## ఆగస్టు

9. 12వ భారత-ఆసియాన్ సమావేశాలను మయన్మార్‌లోని నేపితాలో నిర్వహించారు. భారత విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ పాల్గొన్నారు.
10. 21వ ఆసియాన్ ప్రాంతీయ ఫోరం (ఏఆర్ఎఫ్) సమావేశాన్ని, తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు (ఈఏఎస్) విదేశాంగ మంత్రుల నాలుగో సమావేశాన్ని మయన్మార్‌లోని నేపితాలో నిర్వహించారు. ఈ రెండు సమావేశాలకు భారత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ హాజరయ్యారు.
21. రాష్ట్రాల పర్యటక మంత్రుల జాతీయ సదస్సు దిల్లీలో జరిగింది.
22. సింగపూర్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం) పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని 'ఇంపాక్ట్ - 2014' పేరుతో నిర్వహించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు పాల్గొన్నారు.



సెప్టెంబరు 30

**భారత ప్రధాని మోదీ అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాతో వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్‌లో సమావేశమయ్యారు.**

## సెప్టెంబరు

1. జపాన్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్రమోదీ ఆ దేశ ప్రధానమంత్రి షింజో అబేతో టోక్యోలో జరిగిన శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్నారు.
4. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (NATO) సదస్సును వేల్స్‌లోని న్యూపోర్ట్‌లో నిర్వహించారు. నాటోలోని 28 దేశాల అధిపతులు దీనికి హాజరయ్యారు.
5. భారత్‌లో పర్యటిస్తున్న ఆస్ట్రేలియా ప్రధాని టోనీ అబాట్ ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.
18. తన పర్యటనలో భాగంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రధాని మోదీతో దిల్లీలో సమావేశమయ్యారు.
27. అమెరికా పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభ సమావేశంలో పాల్గొని, ప్రసంగించారు.

## అక్టోబరు

7. 'అందరి కోసం నగరాలు' నినాదంతో 11వ మెట్రోపొలిస్ ప్రపంచ కాంగ్రెస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు.
10. 22వ అపెక్ (APEC) సదస్సు బీజింగ్‌లో జరిగింది.
13. 12వ అంతర్జాతీయ జీవవైవిధ్య సదస్సును దక్షిణ కొరియాలోని పియోంగ్ చాంగ్‌లో నిర్వహించారు.

## నవంబరు

4. భూ పరివేష్ఠిత (సముద్రతీర ప్రాంతం లేని) దేశాల అభివృద్ధిపై ఐక్యరాజ్య సమితి రెండో సమావేశాన్ని ఆస్ట్రియా రాజధాని వియన్నాలో నిర్వహించారు.
15. జి-20 కూటమి శిఖరాగ్ర సదస్సును ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో నిర్వహించారు.

## డిసెంబరు

1. పెరిగిపోతున్న కర్బన ఉద్గారాలను తగ్గించడానికి వచ్చే ఏడాది ప్యారిస్‌లో చరిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకునేందుకు వీలుగా 'వాతావరణ మార్పులపై ఐక్యరాజ్య సమితి సదస్సు'ను పెరూ రాజధాని లిమాలో నిర్వహించారు.